

ఋణకిరణాలతో లోకాన్ని జోకొడుతున్న చంద్రుడు, అఋణ కిరణుడు కనుచూపుమేరలో కానరాగానే తెల్లబోయి పాలిపోయాడు. రాత్రి తెల్లవారి ప్లేటు తిరగేసి యెర్రబారబోయింది. అప్పులు తీర్చేసినవాడి మనసులా లోకం ప్రశాంతంగా వుంది. గాలి చల్లగా మెల్లగా వీస్తోంది. ఉషాదేవి తనలో ఉండి ఉండి నవ్వుకుంటోంది. పువ్వులు మెల్లిగా మేలుకుంటున్నాయి. తొలిసారి వికసిస్తున్న మొగ్గలు పట్టపగ్గాలు లేకుండా మొదటిరోజున అక్కయ్య చీర కట్టుకున్న కన్నెపిల్లలా ఉన్న చోటునే పరవళ్ళు తొక్కుతున్నాయి. పక్షులు గుర్తుకొచ్చిన పాటలన్నీ పాడేస్తున్నాయి కవులు నిరుత్సాహ పడకుండా. కాఫీపొడి అప్పు దొరికేదాకా ఆయనా పిల్లలూ నిద్ర లేవకూడదని ఇల్లాళ్ళు ఆశపడుతున్నారు. అప్పులు ఇచ్చుకున్నవాళ్ళు తెల్లవారుతోందని ఉప్పొంగి పోతున్నారు వీధుల్లోకి. తెచ్చుకున్నవాళ్ళు ఉప్పొంగి పోవటంలేదు గది అవతలికి.

యజమాని అడుగుల చప్పుడు విన్నా, రానీ చూదాం అని కూర్చున్న సేవకుడిలా మొత్తంమీద జగతి ఇంకా తటపటాయిస్తోంది డ్యూటీలో పడదామా, కాస్సేపు ఆగుదామా అని. సూర్యభగవానుడికి కోపం వచ్చింది.

చాలాకాలం తరువాత రావలసిన డబ్బు చేతికి రాగానే అప్పుల వాళ్ళ మొహాన విసిరి కొట్టేవాడిలా, ఆయన దూకుడుగా కిరణాలను గుప్పిం చేస్తున్నాడు. చిక్కటి మర్రిచెట్టుమీద కొమ్మ తొట్టిమధ్య కట్టిన గూట్లోకి ఓ కిరణం పడింది. అందున్న పిల్లకాకి మెల్లిగా ఓ కన్ను సగం తెరిచి చూసి ఓహో తెల్లవారిందనుకొని కావులించి, లేత రెక్కలు బద్ధకంగా విరుచుకుని నోరు తెరుచుకుని అలాగే పడుకుంది. నోట్లో ఏమీ పడకపోయే సరికి ఆకలోయ్ అంది.

ఉష్ కాకి! ఏమిటా కావు కేకలు అప్పులాడిలా అంది తండ్రి కాకి. పిల్ల కన్ను తెరిచి చూసింది. తల్లీ, తండ్రీ గూడుపక్కనే కొమ్మ మీద కూర్చుని దేనికోసమో శ్రద్ధగా చూస్తున్నారు. మంచి పురుగులకోసం కాబోసు అనుకుంది పిల్ల.

అదుగో వచ్చేస్తున్నాయి చూడు. అయిందాపెళ్ళి! నే చెప్పలే? అంది తల్లి కాకి.

అతను ఓరకంటనే కోరగా చూశాడు. పొద్దుటే పరగడుపుని ఆ మాటెందుకు మళ్ళీ? నువ్వూ నీ అలంకారాలూనూ అని విసుక్కొని మళ్ళీ కిందికి చూశాడు.

అతనిమాట రెక్కలో బాణంలా గుచ్చుకుంది. ఆమె నొచ్చు కుంది.

• • •

చెట్టుకింద పెద్ద పుట్టదగ్గర చాలా సందడిగావుంది. మూడురోజుల నాడు పుట్ట ఖాళీ అయినప్పటినుంచీ మళ్ళీ యెవరొస్తారా, యెలాటి పాము దిగుతుందా అని కంగారు పడుతున్నాయి కాకులు రెండూను.

క్రితంరోజు మధ్యాహ్నం ఓ డజను చీమలు వచ్చి వెళ్ళాయి. సంజ వేళ కాకీ, కాకీ బాకీ గురించి తగవులాడుకుంటున్న అలికిడి అయిచూస్తే, ఆయిదారువందల చీమలు కనిపించాయి. అవి పుట్టల్లోకివెళ్ళి వాటాలూ, గాలివాలూ, చెట్టు నీడా, వానా వరదల తాకిడికి అవకాశాలు చూసుకున్నాయి. ఇవతలికి వచ్చి అన్నీ కూడబలుక్కున్నాయి. వాటిల్లో డజను చీమల్ని మిగతావన్నీ గుచ్చి గుచ్చి అడుగుతున్నాయి.

వెర్రికుంకలు అనుకుంది ఆడకాకి.... తీరా యిందాక తెల్లవారేసరికి చూస్తే షుమారు యెనిమిది లక్షల చీమలు సంబారాలూ అన్నీ పట్టుకొని తరలి వచ్చేస్తున్నాయి.

♦ ♦ ♦

కాకమ్మ విరగబడి నవ్వింది. చూడు చూడు ఇంకాసేపటికి సుబ్బన్న, నాగలక్ష్మి వచ్చేస్తారు. ఇవన్నీ యేంగానుట అప్పుడు.... పరి గెడతాయి పొలోమని, అంది.

అవెక్కడొస్తాయిలే, ఆ పాములాడు యీ పాటికి నాగమ్మనుకూడా పట్టి బుట్టలో వేసుకుంటాడు.

కాదంది కాకమ్మ.

మాటలోనే దూరంగా సుబ్బన్నా, నాగలక్ష్మి కనిపించారు. చర చర వచ్చేస్తున్నారు - సరసాలు ఆడుకుంటూ, తుసా బుసా మంటూ.

మందారమొక్క దగ్గర నిలబడ్డ లేడిపిల్ల ఒకటి ఆలోచిస్తోంది— ఈ ఆకులు బావుంటాయా అని.

కొంటె సుబ్బన్న పోతూ పోతూ అటు తిరిగి బుస్సుమన్నాడు. లేడిపిల్ల ఉలికిపడి చూసి నవ్వింది. కానీ పరిగెత్తలేదు.

నాగలక్ష్మి హేళనగా నవ్వింది. చూశావా, తేడా తెలిసిపోతూం చేసు...అంటూ తనోసారి బుస్సుమంది. లేడి, మందారాకుల రుచి సమస్య పరిష్కారం అర్జెంటుగా వాయిదా వేసి వాళ్ళమ్మని పిలుస్తూ పరుగెత్తింది.

కోరలు పీకేశారు కామోసు పాపం సుబ్బన్నకి అంది కాకమ్మ జాలిగా అటే చూస్తూ.

కాకరాజు మాట్లాడలేదు. జరగబోయే కథ తల్చుకుంటే అతనికి గుండె గుభేలు మంటోంది.

ఉత్సాహంగా ఆడుతూ పాడుతూ సుబ్బన్న, నాగలక్ష్మి పుట్ట దగ్గరకి రానే వచ్చారు. వచ్చినవారల్లా కొండపల్లి బొమ్మపాముల్లా కొయ్యబారి పోయారు - తమ పుట్టకు పట్టిన గతి చూడగానే.

పుట్ట గుమ్మాలనిండా, గోడలనిండా లక్షోపలక్షల చీమలు, చాలా హడావిడిగా సందడిగా తిరుగుతున్నాయి. ఐదారు పెద్ద చీమలు ఉత్తర్వులు చేస్తున్నాయి. పిల్లల్ని ఒక కంతలోంచి, బియ్యపు గింజల్ని ఇంకో గుమ్మంలోంచి పంపిస్తున్నాయి. మరో దారివెంట కొన్ని చీమలు పుట్ట మట్టిని పట్టుకెళ్తున్నాయి లోపల గదులు కట్టడానికి.

సుబ్బన్నకి కోపం వచ్చింది. ఏమిటీ అఘాయిత్యం ! ఏమిటీ చొరవ, సరసం, దారుణం, దోపిడీ అనుకొని పడగెత్తి బుస్సుమన బోయాడు.

స్. నువ్వొద్దు, నా మాటవిను, పరువుపోతుంది అంటూ నాగలక్ష్మి పుట్టకేసి బుసకొట్టి తరువాత మాట తూలినందుకు మన్నించమంటూ మొగుడివంక చూసి నాలికలు కొరుక్కొని తల వంచుకుంది. చీమలన్నీ గజగజలాడి ఎక్కడివి వక్కడ స్తంభించిపోయాయి. సింహద్వారం దగ్గర

ఒక చీమంతి చుట్టూ చేరి కులాసాగా కబుర్లు చెప్తున్న కుర్రకారంతా ఆ పిల్ల వేసిన ఒక జోక్‌కు చిమచిమ నవ్వబోయి మానేయడం కూడా సంభవమైంది.

సుబ్బన్నా, నాగలక్ష్మి పుట్టకి కొంచెం దగ్గరగా పాకి ఆగి పడగ లెత్తి సర్పదర్పాన్ని అభినయించారు.

పోజు ఫొటోజెనిక్ గానే ఉంది అన్నాడొక చీమంతుడు. చుట్టూ ఉన్న వాళ్ళంతా పగలబడి నవ్వారు.

బుస్సుమంది నాగలక్ష్మి.

ఉస్ తప్పని మందలించింది పెద్దచీమ. తరువాత ముందుకొచ్చి గుమ్మందగ్గర గుట్టమీద నిలబడి ఎవరుమీరు ఏం కావాలి అంది ఠీవిగా.

చెప్పుకోండి చూదాం అంది నాగలక్ష్మి వెటకారంగా.

చీమ మందహాసం చేసింది.

అమ్మాయి...ఇలాటి పొడుపుకథలేకాదు. నేనింకా చాలా చెప్పుకో గలను.... అయినా నువ్వడిగింది చెబుతా. ఈ పుట్ట యింకా మీదే అను కుంటున్నావుగాని కాదు. మీకూ దీనికీ ఋణానుబంధం తీరిపోయింది. మిగిలింది మీకూ మాకూను. అందుచేత ఇకనించీ ఇది మాది అంది.

పాములు పెట్టిన పుట్టలు చీమలు కిరవైన యట్లు అన్నాడు సుబ్బన్న విచారంగా.

చప్... పాములు పెట్టిన పుట్టలు కాదు చీమలు పెట్టిన... అంది నాగలక్ష్మి కోపంగా.

అచ్చు తప్పు పడివుంటుంది నువ్వు చదివిన పుస్తకంలో...పాములే రైటు. ఆ కారణంవల్ల కూడా యిదిమాదే. లేదా నువ్వన్నట్టు చీమలు పెట్టిన పుట్టలే అయినా కూడా ఇది మాదే. అంచేత యే విధంగా చూసినా— అంది చీమ.

బుస్‌మంది నాగలక్ష్మి. సుబ్బన్నకి కూడా తిక్క వేసుకొచ్చింది. ముందుకు దూకబోయాడు.

అట్టె అట్టె ఆగు— అంది పెద్దచీమ. నాయనా ఆడదాని మాట విని తప్పుదారిన పడకు. నువ్వు పూర్వజన్మలో మాకు ఇంటద్దె బాకీ ఉండి వుండచ్చుగద. అంచేత మేము యీ యిల్లు బేవార్సుగా తీసుకొన్నా తప్పు లేదు— పాతబాకీ కాకపోయినా, నువ్వు ఐదారు జన్మల తరువాత కోటికి పడగెత్తి పుట్టి, వేలకొద్దీ అద్దెకొంపలకు యజమాని కాగల ప్రమాదం వుంది. ఈ చీమలన్నీ అప్పుడు అక్కడ అద్దెకి దిగవచ్చు. నువ్వు అయిదు రూపాయల ఇంటికి పాతిక వసూలు చేయవచ్చు. అప్పుడు పడగల బాకీకి ఇప్పుడు అడ్వాన్సుగా యీ ఇంటి రూపేణా జమకడితే, దేవుడికి మొక్కు బళ్ళు తప్పుతాయి గదా అప్పుడూ.

సుబ్బన్న సందేహంగా భార్యవంక చూశాడు. ఆమె పడగ ఆడించింది.

నాకీ జన్మలమీదా గిన్మలమీదా నమ్మకంలేదు. అంతా ఉత్తి దొంగమాటలు నీవి— బాకీలేదు, కాకీలేదు అన్నాడు సుబ్బన్న ధైర్యంగా.

కావ్ కావ్ మంది చెట్టుమీద కాకి.

చూశావా. నువు కాకి లేదంటే ఉన్నానని పైనించి సాక్ష్యం— అలాగే బాకీకూడా ఉండే వుంటుంది అంది చీమ.

వాళ్ళమాట నమ్మకు అని రెచ్చగొడుతోంది నాగలక్ష్మి.

పెద్దచీమ పక పక నవ్వింది.

ఓయీ అమాయకుడా? నీ ప్రక్కనున్న దానిమాటే నమ్మకు. అది యెవరనుకున్నావు? నీ భార్య అనా! పొరబాటు. ఆమె అసలు పేరు ఋణసుందరి. నూరేళ్ళ క్రితం నువ్వు ఋణదత్తుడి జన్మలో ఉన్నప్పుడు ఈవిడకి బాకీ పడ్డావు. దాని తాలూకు బకాయి, ఈ జన్మలో వసూలు చేసుకుంటోంది. నిన్న నీ కోరలు పీకించింది యెందుకనుకున్నావు? అంది పెద్దచీమ.

సుబ్బన్న తెల్లబోయి నోరు వెళ్ళబెట్టాడు.

చెట్టుమీద కాకమ్మ ముందుకు వంగి తొంగిచూసి, ఇందాక చెప్పింది నిజమే, సుబ్బన్నకి కోరలు పీకేశారు పాపం. అందుకే ఇందాక లేడి భయపడలేదు అంది.

మొగుడు మాటాడలేదు.

ఆడదానిమాట వినడంగూడా ప్రమాదమేనని అతనికి భయం పట్టుకుంది. సరిగ్గా మూడురోజుల క్రితం సుబ్బన్న మాంచి పొగరెత్తిన కోడె తాచు. ఇవాళ ఉత్తి బోసితాచు. ఆరోజు అతనూ నాగలక్ష్మి చెట్టుకింద దోబుస లాడుకుంటూండగా ఓ పాములవాడు వచ్చాడు. నాగలక్ష్మి వాణ్ని చూడగానే గతుక్కుమంది. ఒక నిముషం తరువాత, మొగుడిని పిలిచి, వాడికి దొరికిపొమ్మంది. వాడు పాపం బీదవాడుట. సుబ్బన్న పట్టుబడితే తీసికెళ్ళి అమ్ముకొని నాలుగు డబ్బులు తెచ్చుకుంటాడట. వాడు అమ్మేయ్యగానే సుబ్బన్న, తనను కొన్నవాణ్ని కరిచేసి పారిపోయి రావచ్చు. వెనుక తనుకూడా వచ్చి అక్కడివాళ్ళని కరిచి మొగుణ్ణి విడి

పిస్తుంది. ఏ కళనున్నాడో సుబ్బన్న ఒప్పుకున్నాడు. పాములవాడికి మటుకు ఈ పథకం, నాగలక్ష్మి సదుద్దేశం పూర్తిగా బోధపడలేదు. అందుకని సుబ్బన్న దొరకగానే ముందరే కోరలు పీకేసి మరీ తీసుకెళ్ళాడు. తరువాత నాగలక్ష్మి పొరపాటుకి నాలికలు కరుచుకుని, వాడి కూడాపోయి పట్నంలో సుబ్బన్నని వాడెవరికో అమ్మగానే వాళ్ళని కరిచేసి అతన్ని విడిపించుకు చక్కా తీసుకొచ్చింది. అయితేమటుకు? సుబ్బన్న కోరలో ?

అవి వుంటే యీ చీమలు ఇన్ని నీతులు మాటాడగలిగేవా ?

సుబ్బన్నకూడా ఆ మాటే అనుకుంటున్నాడు. దిగాలు పడిపోయి. చీమ వోదార్చింది. ఫరవాలేదు ఋణదత్తుడా విచారించకు. నీకూ నీ కోరలకి ఋణం తీరిపోయింది. ఈ ఋణానుబంధాలు లోకంమీద అంతటా ఉన్నవే. నీ కింత చేటు తెచ్చింది చాలక యింకా తేవాలని చూస్తున్న నీ భార్య నాగలక్ష్మి అను ఋణసుందరికి నువ్వెలా బాకీ పడ్డావో ఆ కథా కమామీషు గుర్తు చెయ్యనా? అంది.

సుబ్బన్న నాగలక్ష్మివేపు చూశాడు కథ విందామా అని. ఆమె ఏమీ అనలేదు.

చీమ నవ్వింది. వింటుందిలే భయపడకు. లేదా ఏనాడో వో గంట సేపు నాకు బలవంతాన నీ ఆత్మకథ ఏకరువుపెట్టి ఆ గంటా ఋణపడ్డాననుకో అంది.

సుబ్బన్న సరే కానీ అన్నాడు.

మరయితే నువ్వలా పడగ ఎత్తి కూర్చుంటే యెలా, బెణుకుతుంది. స్థిమితంగా కూర్చో. ఓ దత్తుడా! ఈ కథను సావధానంగా వినవలసింది అంటూ కథ ఆరంభించింది చీమ.